ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 25 సెప్టెంబరు 2024

జడ్పీ బదిలీల్లో.. ఇష్టారాజ్యం

- వైసీపీకి అనుకూల ఉద్యోగులకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యేల సిఫార్సులను పట్టించుకోని వైనం

- ఉనికిలో లేని జీవోల ఆధారంగా ఏవోల తిష్ట
- నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసిన అధికారికి అందలం
- 'నిమ్మగడ్డ'కు ఓటు ఇవ్వని వారికి పెదకాకాని పోస్టింగ్
- సీటుకు రేటు కట్టి మరీ వసూలు చేసిన ఓ అధికారి
- ఓ ఉద్యోగితో నగదు వసూలు చేయించినట్లు ఆరోపణలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 24: వైసీపీ అనుకూల ఉద్యోగులకు అందలం.. అడిగినంత ఇచ్చిన వారికి ప్రాధాన్యం.. ఎమ్మెల్యేల సిఫార్సులకు దక్కని గౌరవం.. ఇదీ తాజాగా ఉమ్మడి గుంటూరు జడ్పీలో జరిగిన బదిలీల వ్యవహారం. బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కింది స్థాయి ఉద్యోగిని మధ్యవర్తిగా ఉంచి భారీగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. చివరకు టీడీపీ ఓటమి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తులకు ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్‌లపై సర్వత్రా విస్మయం వ్యక్తమౌతుంది. కొందరు ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సు లేఖలు బుట్టదాఖలు చేశారన్న విమర్శలున్నాయి. గోప్యంగా జరిగిన బదిలీల ప్రక్రియలో జాబితాలను మళ్లీమళ్లీ మార్చినట్లు సమాచారం. బదిలీల సమయంలో అప్పటివరకు దూరప్రాంతంలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు జిల్లా కేంద్రానికి దగ్గరకు రావడానికి ఇష్టపడతారు. జడ్పీ బదిలీల్లో మాత్రం అందుకు విరుద్ధంగా గడచిన ఐదేళ్ల నుంచి గుంటూరులో తిష్ఠ వేసిన వారికి మళ్లీ ఇక్కడే ఉండే అవకాశం దక్కింది. డిప్యూటీ సీఈవో కొందరు ఏవోల కోసం ఉనికిలో లేని జీవోలను బయటకు తెచ్చినట్లు చెబుతున్నారు. వాటి ఆధారంగానే నాడు వైసీపీకి కన్ను, కాళ్ళు, చెవుల్లా పనిచేసిన వ్యక్తులను మళ్లీ అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పెదాకాకాని ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఓ అధికారి టీడీపీ అభ్యర్థిగా ఉన్న ధూళిపాళ్ల నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో నరేంద్ర కూడా సదరు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ బదిలీ లో ఆయనను జడ్పీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. అందుకోసం రూ.2 లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావుకు ఓటును ఓ తహసీల్దార్ తిరస్కరించారు. సదరు తహసీల్దారు భర్త జడ్పీలో ఏవోగా ఉన్నారు. ప్రస్తుత బదిలీలో ఆయనను జిల్లా కేంద్రానికి దగ్గరలోని పెదాకాకానికి మార్చారు. పెదాకాకానిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగిని అక్కడే ఉంచమని ఎమ్మెల్యే నరేంద్ర



లేఖ ఇచ్చినా దానిని పట్టించుకోకుండా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పీఏగా పనిచేసిన వ్యక్తిని ఆ స్థానానికి బదిలీ చేశారు. పెదాకాకాని సీనియర్ అసిస్టెంట్ విషయంలోనూ అదే జరిగింది. సదరు ఉద్యోగి విభిన్న ప్రతిభావంతులైనా కనికరం లేని జడ్పీ అధికారులు ఎమ్మెల్యే లేఖను లెక్క చేయకుండా బదిలీ చేశారు. తాడికొండ ఎమ్మెల్యే ఫిరంగిపురంలో ఉన్న ఓ ఉద్యోగికి లేఖ ఇచ్చినా అమరావతికి పంపారు. ఎమ్మెల్యే నరేంద్ర సొంత గ్రామానికి చెందిన ఓ ల్యాబ్ అసిస్టెంట్‌ను కూడా ఇష్టానుసారంగా బదిలీ చేశారు. జడ్పీ కార్యాలయ ఏవోల బదిలీలకు సంబంధించి ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఇచ్చిన లేఖలకు సరైన ప్రాధాన్యం దక్కలేదని సమాచారం. ఆయన పరిధిలోని గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి కూడా వైసీపీకి అనుకూలంగా ముద్ర పడిన ఓ అధికారిని బదిలీ చేశారు. ఈ పోస్టు కోసం ఎమ్మెల్యే ఇచ్చిన లేఖను బుట్టదాఖలు చేశారు.

ఏకాభిప్రాయంతో ఇచ్చినా పట్టించుకోలేదు..

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోకు పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు పలుమార్లు ఫోన్ చేసి తొమ్మిది మంది ఏవోల బదిలీ విషయంలో కీలకమైన సూచనలు చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు మిగిలిన వారితో మాట్లాడి ఏకాభిప్రాయంతో ఓ జాబితా తయారు చేసి పంపారు. ఆ జాబితా కూడా ఇన్‌చార్జి సీఈవో పక్కన పెట్టేశారని బదిలీల జాబితాను చూస్తే అర్థమవుతుంది. ఓ సీనియర్ ఎమ్మెల్యే, లక్ష్మీనారాయణ అనే అధికారి కోసం ఫోన్ చేసినా ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. వైసీపీ భక్త బృందానికి ఆయా ప్రదేశాల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు పలు కారణాలు చెప్పిన అధికారులు ఎమ్మెల్యేల మాటలను తుంగలో తొక్కేశారన్న విమర్శలున్నాయి.

ఎంత వస్తే అంత..

జడ్పీ బదిలీల వ్యహారమంతా అవినీతి మయమైందన్న ఆరోపణలున్నాయి. ప్రతి పోస్టుకి రేటు కట్టి వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఏవో పోస్టుకి ఒక రేటు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకి మరో రేటు అన్న పద్ధతిలో బదిలీల ప్రక్రియ జరిగినట్లు సమాచారం. ఓ అధికారి వద్ద ఉన్న కింద స్థాయి ఉద్యోగి నగదు వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు ఈ సంభాషణలను ఆడియో, వీడియో రికార్డు కూడా చేసినట్లు తెలుస్తుంది. ఓ వ్యక్తి వద్ద బదిలీ కోసం రూ.3 లక్షలు పుచ్చుకున్నారని తెలిసింది. ఇదే ఉద్యోగి తాను పనిచేసే అధికారి పేరు చెప్పి చివరకు అటెండర్ల వద్ద కూడా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. జడ్పీ చరిత్రలో బదిలీల వ్యవహారంలో ఎప్పుడూ జరగనంత గందరగోళం ఇప్పుడు జరిగినట్లు సమాచారం. వైసీపీకి అనుకూలం అన్న అధికారి ఈ బదిలీల్లో ప్రధాన పాత్ర పోషించడంతో మొత్తం ప్రక్రియ ఆరోపణలమయంగా మారింది.

పదవుల పండుగ



నందం అబద్దయ్య



పిల్లి మాణిక్యాలరావు

- ఉమ్మడి గుంటూరుకు ప్రాధాన్యం
- పోరాడిన వారికి అధిష్ఠానం గుర్తింపు
- పిల్లి మాణిక్యాలరావుకు లిడ్‌కాప్ చైర్మన్
- పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా అబద్ధయ్య

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పలు కార్పొరేషన్ల పాలక మండళ్లను నియమించింది. తొలి విడతగా విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నేతలు కీలక పదవులు పొందారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారికి, సేవలందించిన వారికి అండగా నిలుస్తామని తాజా పదవుల ఎంపికతో చంద్రబాబు నేతల్లో భరోసా కల్పించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావుకు లెథర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(లిడ్‌కాప్) చైర్మన్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్యకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరితో పాటు పలువురు నేతలకు వివిధ కార్పొరేషన్లలో సభ్యులుగా కీలక బాధ్యతలు అప్పగించింది. ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రాయపాటి శైలజ, మంగళగిరికి చెందిన తోట పార్థసారథి, తెనాలికి చెందిన కేశన కోటేశ్వరరావులకు అవకాశం కల్పించింది. రాయపాటి శైలజ అమరావతి ఉద్యమంలో మహిళా నేతగా కీలక భూమిక పోషించగా, పార్థసారథి, కోటేశ్వరరావులు మంగళగిరి, తెనాలిలో కీలక బాధ్యతలు నిర్వహించారు. పద్మశాలీ కార్పొరేషన్‌లో సభ్యులుగా మంగళగిరికి చెందిన కందుల నాగార్జున, పర్వతం మధుసూదనరావు, తెనాలికి చెందిన జొన్నాదుల మహేశ్వరరావు, తాడికొండకు చెందిన బిట్రా వెంకట శివనారాయణ నియమితులయ్యారు. జనసేన పార్టీలో చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్వతం మధుసూదనరావు పని చేస్తున్నారు. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన టీడీపీ నేత కుర్రా అప్పారావు నియమితులయ్యారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన దాసరి రాజా మాస్టారు, జనసేనకు చెందిన వడ్రాణం మార్కండేయబాబు నియమితులయ్యారు. దాసరి రాజా మాస్టారు గతంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అలుపెరుగని పోరాటాలే వరం..

అలుపెరుగని పోరాటాలే నేడు పిల్లి మాణిక్యాలరావుకు వరాలుగా మారాయి. ఆయన పోరాటాలను గుర్తించిన చంద్రబాబు లెథర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించి గౌరవించారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం కారంచేడు గ్రామానికి చెందిన దళిత కుటుంబంలో జన్మించిన మాణిక్యాలరావు 1986లో జరిగిన కారంచేడు ఘటనలో బాధితుడు. మందకృష్ణ మాదిగతో కలిసి ఎంఆర్పీఎస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మొదలు ఈరోజు వరకూ 25 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఆయనది. ఉద్యమాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లిన క్రమంలో ఆయన ఎంఆర్‌పీఎస్‌కు జాతీయ అధ్యక్షుడి స్థానాన్ని సొంతం చేసుకున్నారు. కొన్ని అంతర్గత కారణాలతో రాజీనామా చేసిన మాణిక్యాలరావు 2017లో టీడీపీలో చేరారు. 2019లో రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 2019లో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి తనదైన పోరాట పంథాలో ఆయన కొనసాగారు. ఏ చిన్న సమస్య వచ్చినా అక్కడ ప్రత్యక్షమై వైసీపీ ప్రభుత్వం మీద అలుపెరుగని పోరాటం చేశారు. అధికార ప్రతినిధి హోదాలో మేథో చర్చల్లో తన వాణిని, పార్టీ వైఖరిని బలంగా వినిపిస్తూ వైసీపీ వైఫల్యాలను, దుర్మార్గాలను ప్రజల్లో ఎండగట్టారు. 2021 ఆగస్టు 15న గుంటూరు మంగళదాస్‌నగర్‌లో రమ్య అనే దళిత విద్యార్థిని హత్య ఘటనపై పోరాటం, పరామర్శకు వచ్చిన యువనేత లోకేశ్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడినప్పుడు ధీటుగా ఎదుర్కొన్నారు. చంద్రబాబు, పట్టాభిపై దాడి, అరెస్టు సమయంలో ఉద్యమించారు. టీడీపీ నేతలను అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ఆఫీసుకు తరలించిన సమయంలో అక్కడ ఆందోళనలు చేయడం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వంటి పోరాటాలకు నాయకత్వం వహించారు. 2024 ఎన్నికల్లో ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే టికెట్ ఆశించగా అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఆ సీటు విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులుకు దక్కింది. ఈ నేపథ్యంలో మాణిక్యాలరావుకు నామినేటెడ్ పదవిని అప్పగించి తగిన న్యాయం చేసింది.

అంకిత భావానికి గుర్తింపు

మంగళగిరి: టీడీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పార్టీనే అంటిపెట్టుకున్న నందం అబద్ధయ్యను ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త అబద్ధయ్య మంత్రి నారా లోకేశ్‌కు కుడి భుజంగా పనిచేస్తున్నారు. సౌమ్యుడు, వివాద రహితుడిగా పేరొందిన అబద్ధయ్యకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో తొలి ప్రాధాన్యం లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. చేనేత సామాజిక వర్గానికి చెందిన అబద్ధయ్య 1983లో టీడీపీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగారు. 1984 నుంచి 1994 వరకు 21వ వార్డు అధ్యక్షుడిగా పనిచేశారు. 1999 నుంచి మూడేళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, 2005లో 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2015 నుంచి 2021 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేసిన ఆయన 2022 నుంచి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. రాజకీయంగా ఎన్నో ఆటుపోట్లను చవిచూచిన అబద్ధయ్య 74 ఏళ్ల వయస్సులోనూ విలువలతో కూడిన రాజకీయ విధానాలను అవలంబిస్తూ యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

వరద బాధితులకు పార్ట్‌టైం టీచర్ల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

తాడికొండ, సెప్టెంబరు 24: వరద బాధితులను ఆదుకోవటానికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల పార్ట్‌టైం టీచర్లు ముందుకు వచ్చారు. వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష డీడీ తీసి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోచిపాతల నవీన్‌కుమార్, రాష్ట్ర నాయకులు గురురత్నం, వర్మ, ఇస్మాయిల్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా నాదెండ్ల రామారావు



తాడికొండ, సెప్టెంబరు 24: జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ఎంపికైనట్లు చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వి.ఆంజనేయులు పేర్కొన్నారు. ఫార్మసీ వృత్తిలో అత్యుత్తమ సేవలు అందించినందుకుగానూ అసోసియేషన్ ఆఫ్ ఫార్మస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఏపీటీఐ) జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు రామారావును ఎంపిక చేసిందని చెప్పారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఏపీటీఐకో-2024 సదస్సులో అవార్డును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫార్మసీ విద్య, పరిశోధనా రంగంలో 33 ఏళ్ల అనుభంతోపాటు 500 పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించి 14 పుస్తకాలు రచించి 4 పేటెంట్లును సొంతం చేసుకున్నారని వివరించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా నాణ్యమైన ఫార్మసీ విద్య కోసం ఎన్నో నూతన ఆవిష్కరణలను చేశారని చెప్పారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు రావటంతో చలపతి విద్యా సంస్థల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఆరు రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా ఆరు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ మంగళవారం తెలిపారు. నంబరు 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 7వ తేదీ వరకు, నంబరు 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 8వ తేదీ వరకు, నంబరు 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటరషిటీ, నంబరు 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని అక్టోబరు 2వ తేదీ వరకు, నంబరు 07464 విజయవాడ - గుంటూరు, నంబరు 07465 గుంటూరు - విజయవాడ రైళ్లను అక్టోబరు 7వ తేదీ వరకు రద్దు చేశామన్నారు.

ఏటా రూ.100 కోట్ల వసూలు లక్ష్యం

- ఇది ఏడాదికి 20 శాతం చొప్పున పెరగాలి
- ప్రతీ మిర్చి టిక్కీకి మార్కెట్ ఫీజు వసూలు చేయాలి
- జీరో బిజినెస్ జరగడానికి వీల్లేదు
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత ఆదేశాలు



గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'మిర్చియార్డులోకి అమ్మకానికి వచ్చిన ప్రతీ మిర్చి టిక్కీ లెక్కలోకి రావాల్సిందే. ఏ ఒక్కటీ మార్కెటింగ్ ఫీజు చెల్లించకుండా బయటకు వెళ్లడానికి వీల్లేదు. జీరో బిజినెస్‌కి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి' అని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత ఆదేశించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె తొలిసారిగా మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా యార్డులో కార్యకలాపాలను పరిశీలించి పరిపాలన భవనంలో మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, డీడీ ఝాన్సీరాణితో సమావేశం నిర్వహించారు. పలువురు గ్రేడ్-3, 2 సెక్రెటరీలు, సూపర్‌వైజర్లను కూడా పిలిపించి మాట్లాడారు. అన్ని విషయాలను లోతుగా సమీక్షించారు.

కోల్డ్‌స్టోరేజ్‌లలో 47 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ

ఈ సందర్భంగా కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ ఏడాదికి రూ. 100 కోట్ల మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యంగా ఉందన్నారు. ఇది ఏటా 20 శాతం పెరుగుతుందన్నారు. మిర్చి లావాదేవీలకు యార్డు కేంద్ర బిందువుగా ఉందనీ, ఇక్కడికి ఇతర జిల్లాలు, వేరే రాష్ట్రాల నుంచి రైతులు మిర్చిని తీసుకువస్తారని చెప్పారు. ప్రస్తుతం అన్‌సీజన్ కావడం వలన రోజుకు 20 వేల టిక్కీలు విక్రయం జరుగుతున్నాయి, రకాన్ని బట్టి క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి రూ. 18,500 వరకు ధర లభిస్తుందని అన్నారు. గత సీజన్‌లో ఎక్కువగా దిగుబడి రావడం వలన కోల్డ్‌స్టోరేజ్‌లలో 47 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరగా ఎగుమతి చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఎగుమతిదారులతో ప్రత్యేకించి సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. లేకుంటే మరో రెండు, మూడు నెలల్లో కొత్త స్టాకు వచ్చి రేటు పడిపోయే ప్రమాదం ఉందన్నారు.

వినుకొండ వైద్యశాలలో తనిఖీ

వినుకొండ, సెప్టెంబరు 24: మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కిందకు వస్తాయని, జిల్లా వ్యాప్తంగా ఉన్న నెట్ వర్కు వైద్యశాల్లో పేదలకు ఉచితంగా వైద్యం అందుతుందని పల్నాడు జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా చికిత్స పొందిన రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలని రోగులకు సూచించారు. వైద్యశాలకు వచ్చేటప్పుడు ఆరోగ్యశ్రీకార్డు తీసుకుని వచ్చి హెల్ప్ డెస్క్ దగ్గర పేరు నమోదు చేసుకుని ఉచితంగా పరీక్షలు చేయించుకుని రోగ నిర్ధారణ అయిన వెంటనే ఆస్పత్రిలో చేరి అన్ని రకాల శస్త్రచికిత్సలు పొంది ఆరోగ్యంగా బయటకు వెళ్లవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట డాక్టర్ రజాక్, వైద్యమిత్ర మాచర్ల బుజ్జి, టీమ్ లీడర్ ప్రశాంతి, డీఈవో సాగర్, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 24: పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,490 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద ఒక గేటు ద్వారా 36,950 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణానదికి వస్తున్నాయి.

విద్యుత్‌శాఖలో ఈఈల బదిలీలు

గుంటూరు, సెప్టెంబరు 24: సాధారణ బదిలీల్లో భాగంగా ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోని గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్ పరిధిలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లను బదిలీ చేస్తూ సీఎండీ పి.రవి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీఆర్‌డీఏ సర్కిల్‌తో పాటు గుంటూరు సర్కిల్‌ను మూడు సర్కిల్స్‌గా విభజిస్తూ బదిలీలు చేశారు. గుంటూరు సర్కిల్ పరిధిలో ఉన్న పల్నాడు, బాపట్ల జిల్లాలను కూడా పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తూ బదిలీ ప్రక్రియ నిర్వహించారు. ఈ బదిలీల్లో గుంటూరు సర్కిల్‌లోని గుంటూరు టౌన్ -1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, సీఆర్‌డీఏలోని గుంటూరు-2 ఈఈ రమేష్‌బాబు, చీరాల ఈఈ కె.జాన్‌థామస్, అద్దంకి ఈఈ ఎన్.మస్తాన్‌రావు, బాపట్ల ఈఈ ఆంజనేయులు, గుంటూరు కన్‌స్ట్రక్షన్స్ ఈఈ ఎమ్ శ్రీనివాసబాబులను వారి వారి స్థానాల్లోనే కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వారితో పాటు పలువురు డిప్యూటీ ఈఈలు, ఏఈలు, వివిధ కేటగిరీల ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గుంటూరు సర్కిల్‌లో ఈఈల బదిలీలు ఇలా...

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
కేవీఎల్ఎన్ మూర్తి	డీపీఈ/ ఈఈ	టెక్నికల్ ఈఈ, గుంటూరు
ఎమ్ శ్రీనివాసరావు	గుంటూరు కన్‌స్ట్రక్షన్‌ఈఈ	అదే స్థానం
సీహెచ్ వెంకటేశ్వరరావు	ఎంఆర్‌టీ, గుంటూరు	డీపీఈ, ఈఈ, గుంటూరు
కె సూర్యప్రకాష్	డీపీఈ, ఈఈ, గుంటూరు	ఎంఆర్‌టీ, ఈఈ, గుంటూరు
టి శ్రీనివాసబాబు	గుంటూరు టౌన్-1	అదే స్థానం
టీవీ తులసీరామ్	అమరావతి, ఈఈ	తెనాలి
బాపట్ల సర్కిల్‌లో...		
జి ఆంజనేయులు	బాపట్ల, ఈఈ	అదే స్థానం
ఎన్ సింగయ్య	ఎం, పీ-1, గుంటూరు, ఈఈ	ఈఈ, కన్‌స్ట్రక్షన్స్, బాపట్ల
వీవీ చిరంజీవి	ఈఈ, తెనాలి	ఎంఆర్‌టీ, ఈఈ, బాపట్ల
ఎస్ఏ కరీమ్	ఈఈ, దర్శి	ఈఈ , డీపీఈ, బాపట్ల
పి నాగేశ్వరరావు	ఈఈ, ఎం, పీ-11, గుంటూరు	ఈఈ, టెక్నికల్, బాపట్ల
కె జాన్ థామస్	ఈఈ, చీరాల	అదే స్థానం
ఎన్ మస్తాన్‌రావు	ఈఈ, అద్దంకి	అదే స్థానం
పల్నాడు సర్కిల్ పరిధిలో...		
కె రామసుబ్బారావు	ఈఈ, కార్పొరేట్ ఆఫీస్	ఈఈ, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ పల్నాడు
జె శ్రీనివాసులరెడ్డి	ఈఈ, టెక్నికల్, గుంటూరు	ఈఈ ,ఎమ్ఆర్‌టీ, పల్నాడు
సీహెచ్ రామ్‌బొట్లు	ఈఈ, టెక్నికల్, సీఆర్‌డీఏ	ఈఈ, నరసరావుపేట
ఎమ్ భాస్కరరావు	ఈఈ , మచిలీపట్నం	ఈఈ, మాచర్ల
సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలో....		
జె హరిబాబు	ఈఈ, మాచర్ల	ఈఈ, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ సీఆర్‌డీఏ
ఎస్ శ్రీనివాసరావు	ఈఈ, నరసరావుపేట	ఈఈ, ఎమ్ఆర్‌టీ, సీఆర్‌డీఏ
సీహెచ్ రమేష్	ఈఈ, గుంటూరు టౌన్-2	అదే స్థానం
జె శ్రీనివాసరావు	ఈఈ, విజయవాడ - ఈఈ	ఈఈ, అమరావతి

సంక్షేమం.. అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 24 : ప్రజా సంక్షేమం... అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర పాల ఉత్పత్తిదారుల కల్యాణ మండపంలో జరిగిన కూటమి ప్రభుత్వం వంద రోజులు పరిపాలన, డ్వాక్రా రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు మండలంలో వంద కోట్లు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మహిళా రైతులకు ప్రతి మండలంలో డ్రోన్‌లు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌లు ద్వారా మహిళలు లక్ష రూపాయలు ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.24 కోట్లు చెక్కుల రూపంలో అందించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ గుమ్మడి సిద్ధార్థ, జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఏడీఏ ఉషారాణి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రవీంద్రబాబు, ఏవో వెంకట్రావు పాల్గొన్నారు.

భారత్‌లో జమిలి ఎన్నికలు సాధ్యం కాదు



ప్రసంగిస్తున్న డాక్టర్ తులసి రెడ్డి, పక్కన లక్ష్మణరావు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 24: భారతదేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదనీ, ఆవశ్యకత లేదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ ఏపీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు అవసరమా? సాధ్యమా? అనే అంశంపై జరిగిన చర్చాగోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తుందని, స్థానిక సమస్యల ప్రాధాన్యం తగ్గుతుందనీ, అవినీతి తారాస్థాయికి చేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లలో 500 లక్షల కోట్లు బడ్జెట్లలో వ్యయం చేస్తుంటే అందులో ఎన్నికల కోసం 10 వేల కోట్లు అనేది కేవలం 0.01 శాతం మాత్రమే అని తెలిపారు. మోడీ ప్రభుత్వం చెబుతున్నట్లుగా ఎన్నికలు విడివిడిగా జరగడం వలన అభివృద్ధికి నోచుకోలేకపోతున్నామనేది అర్థరహితం అన్నారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలో ప్రధానంగా ఆరు సవరణలు చేయాలని అన్నారు. జమిలి ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, బహు పార్టీ వ్యవస్థను, ఫెడరిలిజాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ కోటిలోపు జనాభా ఉన్న 100 దేశాలు ప్రపంచంలో ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులలో అత్యధిక జనాభా గల రాష్ట్రాలు భారతదేశంలో జమిలి ఎన్నికలు ద్వారా స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రముఖ విద్యావేత్త మేకల రవీంద్రబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు వినయ్ కుమార్ ప్రసంగించారు.

విద్యార్థులతో స్నేహంగా మెలగాలి

బోయపాలెం(యడ్లపాడు), సెప్టెంబరు 24 : కుటుంబ సభ్యులకు దూరంగా విద్యనభ్యసించేందుకు వచ్చిన విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండలంలోని బోయపాలెం పరిధిలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ముందుగా వంటగదిని, అక్కడి సరుకుల నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందించిన రాగిజావను పరిశీలించగా, వాసన వస్తుండడంతో, స్టాక్ రూంను పరిశీలించారు. గడువు ముగిసిన 40 కేజీల రాగి పిండి ప్యాకెట్లు దర్శనమిచ్చాయి. స్టాక్ రిజిష్టర్లు చూపించాలని ప్రిన్సిపాల్ హనుమంతరావును కోరగా రికార్డులు లేవని, కేవలం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. దీంతో స్టాకు రిజిష్టర్లు ఫిజికల్‌గా లేకపోవడం ఏమిటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులను దండించకూడదని చట్టాలు చెబుతున్నా, మీరు ఎందుకు కొడుతున్నారని, క్లాస్ రూంకు బెత్తాలు తీసుకురాకూడదని మీకు తెలియదా అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఫిర్యాదుల పెట్టె ఎందుకు పెట్ట లేదని ప్రశ్నించిన ఆమె విద్యార్థులకు అందుబాటులో ఫోన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బాలల కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేస్తుందనీ, ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని డీసీవోను ఆదేశించినట్లు చెప్పారు. తహసీల్దార్ విజయశ్రీ, ఎంఈవో నాగరత్నం, ఏసీడీపీవో బి.నిర్మలారాణి, ఎస్సై బాలకృష్ణ ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

యడ్లపాడు, సెప్టెంబరు 24: గురుకుల పాఠశాల విద్యార్థులకు సంబంధించిన విషయంపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్, ఏపీ ప్రైవేట్ టీచింగ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యడ్లపాడు మండలం బోయపాలెం పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను వారు మంగళవారం సందర్శించారు. విద్యార్థులు పాఠశాల నుంచి పరారవడంపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏఐవైఎఫ్, ప్రైవేటు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.శ్రీనునాయక్, చెన్నకేశవులు, రాంబాబు, నాగరాజు, వెంకట నగేష్, వెంకట బుల్లోడు, లెనిన్‌బాబు, చిన్న, రాంబాబు నాయక్, వెంకట్ ఉన్నారు.

సీఈవోగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



గుంటూరు సిటీ, సెప్టెంబరు 24 : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవోగా వి.జ్యోతిబసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కృష్ణా జిల్లా సీఈవోగా పనిచేసిన ఆయన్ను ప్రభుత్వం గుంటూరు బదిలీ చేసిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన తర్వాత జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ను మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్పీ చైర్ పర్సన్ దంపతులు నూతన సీఈవో కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఈవో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కలిశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, ఏసీ హాల్ ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),సెప్టెంబరు 24: ఈనెల 27న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పిన్నెంటి ప్రణయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలా అగ్రిసర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, పయనీర్ ఆటోమోటివ్స్, కేఎల్‌గ్రూపు అమెజాన్ వేర్‌హౌస్, వేటూ న్యూస్, మాస్టర్‌మైండ్స్ తదితర సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. పది నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. జాబ్‌మేళా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మణిపురం ఫ్లైవోర్ కింద, అశ్విని హాస్పటల్ ఎదురు, గుంటూరు, సాంఘిక సంక్షేమ శాఖ బాలురు వసతి గృహం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురు, అమరావతి రోడ్డు, తూళ్లూరులో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. వివరాల కోసం డి.నరేష్(9866366187), ఎ.వెంకటరావు(9505719172)లో సంప్రదించాలని సూచించారు.

బైకుల చోరీ కేసులో నిందితుడు అరెస్టు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొల్లిపర, సెప్టెంబరు 24: బైకుల చోరీ కేసులో ముద్దాయిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపరకు చెందిన అమిరే ఆనందకిషోర్ 2022 నుంచి దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. అనేక కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గుంటూరులో రెండు బైకులు, తెనాలిలో రెండు బైకులు, కొల్లిపరలో రెండు బైకులు దొంగతనం చేసినట్లు తెలిపారు. కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ పోతురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో గత సోమవారం రాత్రి కొల్లిపర మండలంలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద ముద్దాయిని అరెస్టు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: వ్యక్తి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 24: అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నకరికల్లుకు చెందిన కేలం రామకృష్ణ(41) పిడుగురాళ్లలో గోతాల కంపెనీలో పని చేసేందుకు రోజూ వెళ్తుంటాడు. సోమవారం కూడా నకరికల్లు నుంచి పిడుగురాళ్లకు పని చేసేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన భార్య సత్యవేణికి ఫోన్ చేసి ఈ రోజు పని ఎక్కువగా ఉంది, సమయం దాటితే బస్సులు ఉండవు, ఉదయాన్నే వస్తానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పిడుగురాళ్ల నుంచి రామకృష్ణ నకరికల్లుకు వచ్చాడు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై దిగి రోడ్డు దాటి ఊర్లోకి వచ్చే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకుంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సత్యవేణి ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో పడి మహిళ మృతి


మంగమ్మబాయి (ఫైల్ ఫొటో)

దాచేపల్లి, సెప్టెంబరు 24: కృష్ణానదిలో నీళ్ల తాగేందుకు వెళ్లి ఒడ్డుకు రాలేక ఇబ్బంది పడుతున్న గేదెను కాపాడబోయి ప్రమాదవశాత్తూ మహిళ నదిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని భట్రుపాలెం గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామంలో కేతావత్ మంగమ్మబాయి(43) గేదెలను కృష్ణానది ఒడ్డున మేపేందుకు వెళ్లింది. గేదె ఒకటి నదిలోకి దిగి నీళ్ల తాగుతూ నదిలోనే ఆగింది. ఆ గేదెను ఒడ్డుకు తీసుకొచ్చేందుకు వెళ్లిన మంగమ్మబాయి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందింది. మృతురాలికి భర్త అమ్మనాయక్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంఘటన గురించి తెలుసుకున్న స్థానికులు మృతదేహాన్ని నది ఒడ్డుకు చేర్చారు.

రైలు కింద తల పెట్టి బలవన్మరణం



తెనాలి క్రైం, సెప్టెంబరు 24: కదులుతున్న రైలు కింద తల పెట్టి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని మొండిగోడల వద్ద మంగళవారం జరిగింది. తెనాలి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి స్టేషన్ సమీపంలోని మొండిగోడల వద్ద ట్రాక్ పక్కగా నిలబడి ఎదురుగా వస్తున్న రైలు కింద ఒక్కసారిగా తలపెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత సమాచారం లభించలేదు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఎస్‌పీ కాలువలో కొట్టుకుపోయి యువకుడు మృతి

సత్తెనపల్లి, సెప్టెంబరు 24: వినాయక నిమజ్జనంలో ఎన్ఎస్‌పీ కాలువలో ఇద్దరు యువకులు గల్లంతు కాగా, ఒకరిని స్థానికులు కాపాడారు. లక్కరాజుగార్లపాడులోని గుంటూరు బ్రాంచ్ కాలువ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వడ్డవల్లి పీర్లచాడివి ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనోత్సవానికి లక్కరాజుగార్లపాడులోని ఎన్ఎస్‌పీ కాలువ వద్దకు భక్తులు, కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పీర్లచావిడి ప్రాంతానికి చెందిన రఫీ, తిరుపతిరావు ఈత కొట్టేందుకు కాలువలోకి దూకారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రఫీ కొట్టుకు పోగా తిరుపతిరావును స్థానికులు కాపాడారు. ఎన్ఎస్‌పీ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాలువ నీటిని నిలుపుదల చేయించి గల్లంతైన రఫీ కోసం గాలింపు చేపట్టారు. ఎన్ఎస్‌పీ కాలువలో కొట్టుకుపోయిన రఫీ మృతదేహం లభించింది.

కారు ఢీ: వ్యక్తి మృతి

బాపట్ల,సెప్టెంబరు 24 : ఏరియా వైద్యశాల ఔట్‌పోస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కర్లపాలెం రోడ్డులో డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు నేషనల్ హైవే రోడ్డుపై స్కూటీపై వెళుతున్న దేవరకొండ వెంకటేశ్వరరావు (35) పార్వతి దంపతులను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది.స్థానికులు వారిని ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పార్వతికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

46,245 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 48,267 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,245 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 24,264 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	9000	16500
నెంబరు. 5	9500	14500	నెంబరు. 5	10000	15500
273	9000	14000	273	9500	10000
341	9000	15500	341	9500	16500
4884	13000	13500	4884	10000	13600
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18600	తేజ	9500	18500
బ్యాడిగి	9000	15000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	9000	15500	దేవనూరు డీలక్స్	10500	16500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఎరువుల కొరత లేకుండా చూడాలి

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, సెప్టెంబరు 24 : జిల్లాలో రైతులకు ఎరువులు కొరత లేకుండా చర్యలు చేపట్టి అందుబాటులో ఉండే విధంగా చూడాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. 'కౌలు రైతులపై కనికరమేది' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కౌలుదారులకు రుణాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలను తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ ఎరువులు అధిక ధరలకు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. అదేవిధంగా పంటనమోదు ప్రక్రియ ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. పంట నమోదు చేసిన ప్రతిరైతుకు తప్పనిసరిగా ఈకేవైసి చేయించాలని ఆదేశించారు. రైతులకు పంటనష్టపరిహారం త్వరితగతిన అందించటానికి పరిహార జాబిత సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, మండల వ్యవసాయాధికారులు, రైతులు, వ్యవసాయ సహాయ సంచాలకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి

● మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 24 : బాపట్ల పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. వంద రోజుల పరిపాలన పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఉద్దేశించి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో మెగా శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమానికి 68 లక్షల రూపాయలు తీసుకురావటం జరిగిందన్నారు. తద్వారా పట్టణంలో ప్రత్యేక శానిటేషన్ పనులు చేయటమే కాకుండా 105కిలోమీటర్లు విస్తరించి ఉన్న డ్రైనేజిలను శుభ్రం చేయటం జరిగిందన్నారు. పెన్షన్లు పెంచిన ప్రభుత్వం అన్న క్యాంటీన్‌ల ద్వారా నాణ్యమైన భోజనం పేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న పట్టణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని 100 ఎకరాల విస్తీర్ణంలో మరో సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు పంపించటం జరుగుతుందన్నారు. అమృత్ 2.0 కింద రూ.15 కోట్లు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.5 కోట్లు కలిపి రూ.20 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించటం జరిగిందన్నారు. జగనన్న కాలనీలలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పట్టణంలో ఉన్న 7 పార్కులతోపాటు మరో మెగా పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆంధ్రగ్రీన్ కార్పొరేషన్ ద్వారా చెరువులకు మరమ్మతులు చేసి చుట్టూ మొక్కలు పెంచుతామన్నారు. రైల్వే అండర్ పాస్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఏర్పాటు చేయటమే కాకుండా ప్రధాన కూడళ్ళల్లో టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో కోతులు, కుక్కల బెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో జంతువధ లేకుండా చూస్తామని చెప్పారు.



చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వి.నిర్మల్‌కుమార్

ముంపు బాధితులకు శాశ్వత పరిష్కారం చూపుతాం : కమిషనర్

బాపట్ల, సెప్టెంబరు 24 : 'మురుగునీటి మధ్య యానాదుల జీవనం, చంద్రబాబు హామీని పట్టించుకోని అధికారులు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంతో అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సిబ్బందితో కలిసి మంగళవారం బాపట్లలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీకాలనీ ఎస్టీ కుటుంబాలను సందర్శించారు. ఇళ్ళ చుట్టూ వర్షపునీరు, మురుగునీరు నిలిచి దుర్భరజీవితం అనుభవిస్తున్న వారిని చూచి చలించిపోయిన కమిషనర్ బాధితులతో మాట్లాడి అన్నిరకాల వసతులు కల్పిస్తానని హామినిచ్చారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడి వరద సమయంలో బాధితులకు అందించిన సాయం వలే రాజీవ్‌గాంధీకాలనీలోని యానాదుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిత్యావసరాలు అందించాలని చెప్పారు. కాలనీ ముంపునకు కారణమైన చెరువు చుట్టూ కట్ట ఏర్పాటు చేసి నీరు ఇళ్ళలోకి రాకుండా చర్యలు చేపడతామన్నారు. చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలలో మురుగునీటిని ఇంజన్లతో బయటకు పంపిస్తామని ఆ ప్రాంత ప్రజలకు హామినిచ్చారు. ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలను చేపట్టి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ నజీర్, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆవులను శ్రీశైలం గోశాలకు తరలించేందుకు ఏర్పాట్లు

బాపట్ల, సెప్టెంబరు 24 : బాపట్ల పురవీధులలో సంచరిస్తూ ప్రమాదాలకు కారణమౌతున్న ఆవులను శ్రీశైలం గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 3వ వార్డు సంరక్షణ కేంద్రంలో ఉన్న ఆవులను పరిశీలించిన కమిషనర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆవులను తీసుకెళ్ళాలని యజమానులకు తెలిసే విధంగా ప్రకటనలు ఇవ్వటం జరిగిందని, అయినప్పటికి వారు తీసుకెళ్ళకపోవటం వల్ల సంరక్షణ కేంద్రంలో ఉన్న ఆవులతోపాటు రోడ్లపై సంచరించే వాటిని పట్టుకొని గోశాలకు తరలిస్తామని చెప్పారు.

మున్సిపల్ సూపరింటెండెంట్‌గా కోటేశ్వరమ్మ

బాపట్ల,సెప్టెంబరు 24 : మున్సిపల్ సూపరింటెండెంట్‌గా వై.కోటేశ్వరమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జాయినింగ్ రిపోర్ట్‌ను కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు అందజేశారు. చీరాల పురపాలక సంఘంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆమెను పలువురు అభినందించారు.



కమిషనర్‌కు జాయినింగ్ రిపోర్ట్ అందజేస్తున్న కోటేశ్వరమ్మ

రిక్షా పుల్లర్లకు ఎలక్ట్రానిక్ రిక్షాలు ఇప్పించాలని వినతి

బాపట్ల,సెప్టెంబరు 24 : దశాబ్దాలుగా చెక్కబల్ల రిక్షాలను తొక్కుతూ జీవనం సాగిస్తున్న రిక్షా కార్మికులకు ఎలక్ట్రానిక్ రిక్షాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు మేకల ప్రసాద్ కోరారు. ఈవిషయమై మంగళవారం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలక్ట్రానిక్ రిక్షాలు ఇప్పిస్తే తమ జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి వివిధ కార్పొరేషన్‌ల ద్వారా ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని హామినిచ్చారు.

రెడ్‌క్రాస్ ఆశయ సాధనకు కృషి చేద్దాం : ఎంపీడీవో

కర్లపాలెం, సెప్టెంబరు 24 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావును రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ కర్లపాలెం ఛైర్మన్ ఇనకొల్లు పోలీసురావు మంగళవారం సభ్యులతో కలిసి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈక్రమంలో భాగంగానే ఎంపిడివో శ్రీనివాసరావును యానాది హక్కుల పోరాటసమితి అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర నాయకులు తిరువీదుల శంకరప్రసాద్ దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఎస్టీయూ నాయకులు బొంతా వెంకటేశ్వర్లు, బత్తుల నాగరాజు, దబ్బకూటి ఆదినారాయణ, పందరబోయన తదితరులు ఉన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ కరీముల్లా, జిడుగు బాలకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంచుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

రాష్ట్రాభివృద్ధి కోసమే చంద్రన్న శ్వాస, ధ్యాస

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

చుండూరు, సెప్టెంబరు 24 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఊసు, ధ్యాస, శ్వాస ఎప్పుడు రాష్ట్ర అభివృద్ధిపైనే ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వలివేరులో మంగళవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆనందబాబు గ్రామంలో వీధి వీధికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కళ్యాణ మండపంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని ప్రభుత్వ వ్యవస్థలను గుల్ల చేశాడని, ఇసుక, మద్యం ద్వారా అంతులేని దోపిడి చేశారన్నారు. చివరికి రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చాడని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు కానుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరిగి పంచాయతీలకు ఆర్థిక వనరులు కల్పించి ఊపిరి పోశారని అన్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ.10 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ దేవిశెట్టి మల్లిఖార్జునరావు, ఎంపీడీవో సుగుణమ్మ, టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, గుదేటి ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, వివిఎస్‌కె ప్రసాద్, ఊసా రాజేష్, పోకల శ్రీనివాసరావు, దేవిరెడ్డి నాగేశ్వరరావు, శరత్‌చంద్ర, భీమవరపు శ్రీమాన్, కావూరి శ్రీనివాసరావు, రాయపాటి శ్రీనివాసరావు, ముక్కామల వేణు, ఆలపాటి నాగభూషణం, జాన్‌సైదా, పిట్టు వెంకటరెడ్డి, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సేవకులుగా పనిచేస్తాం... ప్రజలకు మేలు చేస్తాం : వేగేశన

బాపట్ల,సెప్టెంబరు 24 : నాయకులుగా కాకుండా ప్రజలకు సేవకులుగా పనిచేస్తామని తద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగే విధంగా చూస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. వంద రోజుల పాలన సందర్భంగా మండలంలోని నరసాయపాలెం గ్రామంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికెళ్ళి వంద రోజుల పాలనలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం గురించి వివరిస్తూ కరపత్రాలు ఎమ్మెల్యే వేగేశన పంచిపెట్టి స్టిక్కర్లు అంటించారు. గత 5 సంవత్సరాలు వైసీపీ పాలనలో ప్రజలు అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వంద సంక్షేమ ఫలాలు అందించినట్లు తెలిపారు. ముంపు సమయంలో బాధితుల పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు జెట్టి దినేష్, కామేపల్లి కృషిబాబు, చెన్నుపాటి కిషోర్, ఎంపీడీవో బాబురావు, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, మోహనరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 24 : మండలంలోని అల్లూరు, అలకాపురం గ్రామపంచాయతీలలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం మంగళవారం ఆయా కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పిట్టలవానిపాలెం ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ బి.సుజాత పాల్గొని మాట్లాడుతూ నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులలో పెంచిన పెన్షన్లు ఇవ్వటం, మెగా డీఎస్సీ అమలు చేయటం, నూతనంగా అన్న క్యాంటీన్‌లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారన్నారు. ఆమె అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్ళి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను అంటించి కరపత్రాలను అందజేశారు. ఈ గ్రామ సభలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉప్పు చెంచులక్ష్మి, మంతెన గంగరాజు, అల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి శివకుమార్, సచివాలయ కార్యదర్శి అరుణబాబు, కార్యదర్శి సుబ్బారావు, ఆయా పార్టీల నాయకులు, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు కృష్ణ, టీడీపీ అల్లూరు గ్రామ అధ్యక్షుడు నిజాంపట్నం నాగరాజు, పలువురు గ్రామపెద్దలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, సెప్టెంబరు 24 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎం.వి.రాజుపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ కర్లపాలెం ప్రధాన కార్యదర్శి పిట్ల వసంతరెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి నిర్వహించి మంగళవారం కరపత్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఆట్ల బాలశంకర్‌రెడ్డి, తోట బాలరామాంజనేయరెడ్డి, భ్రమరాంబ, పిసి సౌందర్య తదితరులు పాల్గొన్నారు



వంద రోజుల పాలన పోస్టర్లను విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

● రేపల్లె, సెప్టెంబరు 24 : రాష్ట్రాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు దండుప్రోలు వెంకటేశ్వరరావు అన్నారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం 100 రోజుల పాలన గురించి ఏర్పాటు చేసిన పోస్టర్లను విడుదల చేసి తమ విజన్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ పాలనలో అభివృద్ధి శూన్యమని, కక్షలు, కార్పణ్యాలు, దాడులు తప్పా ప్రజలకు సంక్షేమాలను అందించిన దాఖలాలు లేవన్నారు. దీపావళి నుంచి మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లను అందిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

● వేమూరు, సెప్టెంబరు 24 : మండలంలోని చదలవాడ, కుచ్చెళ్లపాడు గ్రామాల్లో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో అనురాధ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుచ్చెళ్లపాడు సర్పంచ్ గాజుల వెంకటసుబ్బయ్య, ఈవోపిఆర్‌డి శేఖర్, పంచాయితీ కార్యదర్శి సాధిక్ ఆలీ, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా విభాగం కార్యదర్శి సోమరౌతు అనురాధ, టీడీపీ నేతలు టి.సుధీర్‌బాబు, బి.కోటేశ్వరరావు, దండే ధనుంజయరావు, రాజు, దాసు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోతుమర్రులో..

మండలంలోని పోతుమర్రు గ్రామంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో అనురాధ తెలిపారు. కార్యక్రమానికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 24 : రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసి పని చేస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని అప్పికట్ల గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రామకృష్ణ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ శాస్త్రసాంకేతిక సలహాలు అధికారులు అందించి అధిక వ్యవసాయోత్పత్తులు సాధించే విధంగా చూడాలని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ మాట్లాడుతూ పంటసాగులో ఆధునిక పద్దతులు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త రాధాకృష్ణమూర్తి, ఏడీఏ ఎ.లక్ష్మి, వ్యవసాయాధికారి చంద్రశేఖర్, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, బాపట్ల పరిశీలకులు సాంబిరెడ్డి, గుడిపూడి, భర్తీపూడి, అప్పికట్ల సర్పంచ్‌లు హనుమాన్‌జి, ఆచంట అమరేష్, జి.రజనీ తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, సెప్టెంబరు 24 : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి టీడీపీ అధికారి ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. మంగళవారం వేమూరు, జంపని గ్రామాల్లో వ్యవసాయ శాఖ సహాయక అధికారి మహేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన విజయబాబు మాట్లాడుతూ వరదల వల్ల పంట నష్టానికి హెక్టారుకు రూ.25 వేలు పరిహారాన్ని కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం జరిగిందన్నారు. మహేష్‌బాబు మాట్లాడుతూ రైతులకు సాగుపై మెలకువలను వివరించడంతో పాటు చీడపీడల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశాల్లో వీఏఏలు ప్రమీల షాహీన్, మహాలక్ష్మి, రమేష్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ ప్రతినిధి ఆలం తదితరులు పాల్గొన్నారు.



వేమూరులో రైతు సమావేశంలో మాట్లాడుతున్న విజయబాబు

● భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 24 : భట్టిప్రోలు అద్దేపల్లిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయాధికారి జి.మీరయ్య, రైతులకు సరైన మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడుకోవాలని పలు సూచనలు, సలహాలు అందించారు. సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్ సంబంధిత పరికరాలు అందించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యడ్ల జయశీలరావు, సిబ్బంది రజని, నరేష్, రైతులు పాల్గొన్నారు.

● రేపల్లె, సెప్టెంబరు 24 : రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ దోహదపడుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ ఆర్.విజయబాబు అన్నారు. రేపల్లె మండలం కారుమూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రతి రైతు తాము వేసిన పంటను ఈ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి.వాణిశ్రీ, కారుమూరు వీఆర్వో ఆర్.వెంకటేశ్వరరావు, సర్పంచ్ గుడి రమాదేవి, సామ్రాజ్యం, ఏఈవో తేజస్విని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ విజయబాబు

● చెరుకుపల్లి, సెప్టెంబరు 24 : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పురుగుమందులు, ఎరువులను వాడుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో టి.బాలాజీగంగాధర్ అన్నారు. మండలంలోని కుంచాలవారిపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రిమిసంహారక మందులను ఎప్పుడు పడితే అప్పుడు వాడవద్దని గ్రామాల్లోని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 24 : మండల పరిధిలోని జీఎస్ పాలెం రైతు సేవా కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా నీటమునిగిన పంటపొలాలలో నీటిని బయటకు తరలించి వ్యవసాయశాఖాధికారులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారులు, సిబ్బంది, రైతుసేవ కేంద్రం కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, సెప్టెంబరు 24 : మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరి తెలిపారు. అమృతలూరు, పాంచాళవరం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, టీడీపీ నాయకులు క్రొత్తపల్లి రవీంద్రబాబు, సుంకర మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ డే వేడుకలు

బాపట్ల, సెప్టెంబరు 24 : పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో 56వ జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీస్మిత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతి విద్యార్థి సేవాదృక్పథం అలవర్చుకోవాలన్నారు. స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేయించి పురవీధులలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

● బాపట్ల, సెప్టెంబరు 24 : ఇతరులకు నిస్వార్థ భావనతో సేవ చేయటమే ఎన్ ఎస్ఎస్ ప్రథమ లక్ష్యమని బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ తెలిపారు. కళాశాలలో మంగళవారం జాతీయ సేవ పథక వ్యవస్థాపక దినోత్సవం అసోసియేట్ డీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులతో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బ్లెస్సీసాగర్ ప్రతిజ్ఞ చేయించారు. పీజీ స్టడీస్ మాజీ డీన్ డాక్టర్ రావూరి వీరరాఘవయ్య పాల్గొని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ విమల, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్ల, సెప్టెంబరు 24 : స్వచ్ఛంద సేవ విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి తెలిపారు. కళాశాలలో మంగళవారం జాతీయ సేవాపథకం దినోత్సవం సందర్భంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ మండవ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.సంధ్యా, డాక్టర్ కె.విజయ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, సెప్టెంబరు 24 : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మశీలలో ఎన్ఎస్ఎస్‌డే వేడుకలను మంగళవారం అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిఇజికె.మూర్తి మాట్లాడుతూ సేవే లక్ష్యంగా కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ ప్రస్థానం ఎంతో అభినందనీయమన్నారు. వివిధ సందర్భాలలో విశిష్ఠ సేవలందించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్స్‌ను అభినందించి సర్టిఫికెట్‌లను అందించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌లు దొప్పలపూడి రామ్మోహనరావు, జి.దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కె.హరిపద్మప్రసాద్,ట్రెజరర్ టి.రామకృష్ణారావు, ఎన్ఎస్ఎస్ అధికారి కె.పూర్ణచంద్రరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు.

బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో ఎన్‌సీసీ క్యాడెట్ సెలక్షన్స్

బాపట్లరూరల్, సెప్టెంబరు 24 : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్ సెలక్షన్స్ జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఈసెలక్షన్స్‌కి 22ఎ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఉదయ్ కుమార్, సుబేదర్ శివదేవ్ సమక్షంలో సెలక్షన్ జరిగాయని తెలిపారు. 80 మంది సామర్థ్యం గల ఎన్‌సీసీ యూనిట్‌కు అందరూ అర్హత సాధించి పూర్తి సామర్థ్యంతో ఎన్‌సీసీ యూనిట్ చేరుకున్నదని ఎఎన్‌వో సుష్మా చెప్పారు.

చెకుముఖి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలి

బాపట్లరూరల్, సెప్టెంబరు 24 : చెకుముఖి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. బాపట్ల మండలం కెబిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావుకు మంగళవారం బ్రోచర్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో ఈనెల 25న, మండల స్థాయి అక్టోబరు ఒకటిన, జిల్లా స్థాయిలో అక్టోబరు 27న, రాష్ట్రస్థాయిలో నవంబరు 9, 10 తేదీలలో జరుగుతాయని తెలిపారు. 8, 9 తరగతుల విద్యార్థులకు జరిగే ఈ చెకుముఖి టాలెంట్ పరీక్షలో విద్యార్థులు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కెబిపాలెం హైస్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

కొల్లూరు, సెప్టెంబరు 24 : వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని గుంటూరుగూడెంలో మంగళవారం విలేజ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ సంస్థ (వీఆర్‌ఓ) వారు మంగళవారం 250 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. గ్రామంలోని చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వేళంగిణి రాజు, హైకోర్టు సీనియర్ న్యాయవాది, ప్రభుత్వ మాజీ న్యాయవాది తాడిపర్తి బాలస్వామి చేతుల మీదుగా పది కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, వంటనూనె కేజీ, రెండు పచ్చడి సీసాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేపల్లె సర్కిల్ కో-ఆర్డినేటర్ కె.దేవకి, సంస్థ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరద బాధితులకు దోమ తెరలు...


భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 24 : వరద ప్రభావిత గ్రామాల్లో బాధితులకు స్వచ్ఛంద సంస్థలు దోమ తెరలు పంపిణీ చేశారు. కొల్లూరు మండల పరిధిలోని శివరాంపురం, తిప్పలకట్ట, కిష్కిందపాలెం గ్రామాల్లో 500 కుటుంబాల వారికి గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఇంటర్నేషనల్ వాసవి జాగృతి సంస్థల ప్రతినిధులు దోమ తెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు గుడివాడ రవీంద్రకుమార్, జాగృతి అధ్యక్షుడు రంగా చంద్రశేఖర్, సభ్యులు తుమ్మల వెంకటసాయినాగభూషణం, బొలిశెట్టి బోపారావు, ఎ.వెంకటేశ్వరరావు, నంబూరు నాగభూషణరావు, సంకా శ్రీనివాసరావు, నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, వెల్లటూరు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చెక్‌పోస్టులు : సీఐ

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 24 : ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు ఏడు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 32 ట్రాక్టర్లు, ఒక లారీని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అక్రమ రవాణా నియంత్రణకు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు సంయుక్తంగా వివిధ ప్రాంతాల్లో ఏడు చెక్‌పోస్టులు నిర్వహించబోతున్నట్లు సాఐ తెలిపారు. కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 9 కేసుల్లో 27 ట్రాక్టర్లు, భట్టిప్రోలు స్టేషన్ పరిధిలో ఐదు ట్రాక్టర్లు, ఒక లారీని సీజ్ చేయడం జరిగిందన్నారు. ఇకపై ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను కోర్టుకు అప్పగించడం జరుగుతుందని సీఐ తెలిపారు.

తృటిలో తప్పిన ఆర్టీసీ బస్సు ప్రమాదం

అమృతలూరు, సెప్టెంబరు 24 : ఆర్టీసీ బస్సు ప్రమాదం తృటిలో తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. తెనాలి నుంచి నిజాంపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు మండల పరిధిలోని పెదపూడి వద్ద రహదారి వెంట ఉన్న కాల్వలోకి వెళ్లింది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పాటు, బస్సు ఫిట్‌నెస్ కూడా సక్రమంగా లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



కాల్వలోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు

ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

రేపల్లె, సెప్టెంబరు 24 : రేపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఫ్లెక్సీని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఉద్దేశ్యపూర్వకంగా తొలగించి అవమానించే రీతిలో చించిపారవేశారని ఇలాంటివి మానుకోవాలని న్యాయవాదులు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రఘురామకృష్ణరాజుపై దేశ ద్రోహం చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది దారం సాంబశివరావు, జైభీమ్ నాయకులు దేవా రమేష్‌రాంజీ, న్యాయవాదులు కర్రా ప్రతాప్, గుమ్మడి కుమార్, యడ్ల పోతురాజు, దళిత, ప్రజా సంఘాల నాయకులు చెరుకూరి లక్ష్మణ్‌రావు, వాగోలు రమేష్, పెరికల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపఖజానా కార్యాలయంలో రికార్డుల పరిశీలన

చీరాల, సెప్టెంబరు 24 : ఉపఖజానా కార్యాలయంలో మంగళవారం బాపట్ల డీటీవో కార్యాలయ ఏటీవో అనూరాధ బృంద సభ్యులు రికార్డులను పరిశీలించారు. ఇటీవల సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేసే అధికారులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పాత వారిని బదిలీ చేసి కొత్తవారిని నియమించారు. ఈ క్రమంలో ఏటీవో అనూరాధ బృందం ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రికార్డులను పరిశీలించారు. ఎస్టీవో ఎంవీ సుబ్బారావు వారికి రికార్డులను చూపించారు. రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

లెదర్ ఇండస్ట్రీస్ చైర్మన్‌గా మాణిక్యాలరావు



చీరాల, సెప్టెంబరు 24 : లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా చీరాల మండలం విజయనగర్ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నేత పిల్లి మాణిక్యాలరావును ప్రభుత్వం నియమించింది. మాణిక్యాలరావు సుదర్ఘీకాలంగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. వివిధ పదువుల్లో తనదైన శైలిని చాటుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన పలువురు మాణిక్యాలరావు నియామకంపై అభినందనలు తెలిపారు.

గ్రామాలలో ఏదీ స్వచ్ఛత?

- ఎక్కడ చూసినా చెత్త కుప్పలే
- ప్రత్యేక కార్యక్రమాల్లోనూ మెరుగుపడని పారిశుధ్యం
- పొంచి ఉన్న అంటు వ్యాధుల ముప్పు



రోడ్ల వెంబడి దర్శనమిస్తున్న చెత్త



కొప్పెరపాడులో నిలిచి ఉన్న మురుగు



నక్కబొక్కలపాడు సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలు

బల్లికురవ, సెప్టెంబరు 24 : ఒక వైపు స్వచ్ఛగ్రామాలుగా ఉండేందుకు ప్రభుత్వం ఆదేశాలతో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాలు జరుగు తున్నా గ్రామాలు మాత్రం స్వచ్ఛత నహీగా మారాయి. ఏ గ్రామంలో చూసినా రోడ్ల వెంబడి వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోయి పారిశుద్యం అధ్వానంగా తయారయింది. క్షేత్ర స్థాయిలో అధికారులు మాత్రం ఫొటోలను తీసి పారిశుద్య పనులు చేశామని మమ అనిపిస్తున్నారు. దీంతో అంటు వ్యాదుల ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛ హీ కార్యక్రమంలో ఎక్కడ చెత్త ఉన్న ఫొటో తీసి పంపిస్తే గంటలో తీసి వేయిస్తామని అధికారులు ర్యాలీలలో చెప్తున్న ఎక్కడ అమలులో మాత్రం జరగడం లేదు. గ్రామాలలో రోడ్ల వెంబడి మురుగు విలయ తాండవం చేస్తోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. స్వచ్ఛ గ్రామాలు ఎలా ఏర్పాటు అవుతాయని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు గ్రామాలలో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను మెరుగు పరిచేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ మండలంలోని అత్యధిక గ్రామాలలో వ్యర్థాలు రోడ్ల వెంబడి దర్శనమిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా స్వచ్ఛ కార్యక్రమాలు జరుగుతున్న గ్రామాలలో మాత్రం ఎక్కడ అమలు లో మాత్రం జరగడం లేదు. మండల కేంద్రం లో అధికారులు ఒక ర్యాలీ చేపట్టి స్వచ్ఛ కార్యక్రమాన్ని చేపట్టినా క్షేత్ర స్థాయిలో మాత్రం చెత్త తొలగించే పనులు చేయలేదు. బల్లికురవలోనే చెరువు సమీపంలో, బస్సు స్టేషన్ ఆవరణలో రోడ్ల వెంబడి వ్యర్థాలు పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. నక్కబొక్కలపాడు, కొణిదెన, ఉప్పుమాగులూరు, కొప్పెరపాడు, వైద న, ముక్తేశ్వరం, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాలెం, మల్లాయపాలెం, వేమవరం, కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామాల పరిధిలో స్వచ్ఛత అనేది కనిపించడం లేదు ఎటూ చూసిన వ్యర్థాలు, రోడ్లపై మురుగు దర్శన మిస్తున్నాయి. కొప్పెరపాడు గ్రామంలో అయితే సిమెంట్ రోడ్లపై గుండానే మురుగు పారుతుంది అని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు ఉన్న ఆలంకార ప్రాయంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా గ్రామాలను స్వచ్ఛతగా ఉంచేలా ప్రజలు అవగాహన కల్పించడంతో పాటు వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్

మార్చి 31 నాటికి గృహాలు పూర్తి చేయాలి

పంగులూరు, సెప్టెంబరు 24 : పీఎంఏవై పథకం ద్వారా మంజూరైన గృహాలను 2025 మార్చి 31లోగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్ అధికారులకు సూచించారు. గృహ నిర్మాణాలపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, చందలూరు, బూదవాడ, తూర్పు తక్కెళ్లపాడు, కొప్పెరపాడు, పంగులూరు గ్రామాలలో మొత్తం 437 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. అర్బన్ బీఎల్‌సీ కింద 21 గ్రామ పంచాయతీలలో 738 గృహాల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. 12 ప్రత్యేక బృందాలు ఈ నెల 28న లబ్ధిదారులతో సమావేశం నిర్వహించాలన్నారు. మార్చి 31 నాటికి గృహాలు నిర్మించుకున్నవారికి మాత్రమే ప్రభుత్వ సాయం అందుతుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ నాగరాజారావు, హౌసింగ్ ఏఈ కిషోర్‌కుమార్ ఇంజనీరింగ్, ఇతర విభాగాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : అసంపూర్తిగా ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రాంబాబు సూచించారు. మంగళవారం కార్యాలయంలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న 281 మంది గృహ లబ్ధిదారులను కలిసి పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఈ దుర్గా రమేష్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : పెండింగ్‌లో ఉన్న 285 ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా లబ్ధిదారులు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి డీఈఈ రమేష్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సమావేశం హాలులో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ రమణనాయక్, ఈవోపీఆర్డీ శివరాం ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

156 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలకు హాజరైన ప్రజలు

బల్లికురవ, సెప్టెంబరు 24 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశీస్సులతో తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర్ నేత్రాలయం వారితో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. గ్రామ పరిసర గ్రామాలకు చెందిన 156 మందికి వైద్యాధికారి యల్లారెడ్డి బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 58 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా బుధవారం శంకర్ నేత్రాలయంలో చేసి తిరిగి తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మార్టూరు హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సీహెచ్‌వో దుర్గ, టీడీపీ నేతలు అమరనేని కాశీవిశ్వనాథం, దేవినేని నరేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 24 : మండల పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త పరికరాలను ఏర్పాటు చేసేందుకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమ వెంచర్ల తొలగింపు

మార్టూరు, సెప్టెంబరు 24 : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, అనధికారికంగా ఇంటి స్థలాల వెంచర్లు వేసి అమ్మకాలు చేయాలనుకుంటున్న వ్యక్తుల ప్రయత్నాలకు గ్రామ పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీకి రావలసిన ఆదాయానికి గండికొట్టేలా వేసిన అక్రమ లేఅవుట్లపై కొరడా ఝుళిపించారు. వారం రోజులలో మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలో కొంతమంది వ్యక్తులు వేసిన నాలుగు అనధికార లే అవుట్‌లలోని హద్దురాళ్లను పంచాయతీ అధికారులు తొలగించారు. స్థానిక నేతాజీనగర్ సమీపంలో, గన్నవరం రోడ్‌లో, నాగరాజుపల్లి రోడ్‌లో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దాదాపుగా 4ఎక రాలకు పైగా విస్తీర్ణంలో నాలుగు అక్రమ వెంచర్లను వేశారు. ర్లను ఏర్పాటు చేశారు. వారికి ఇష్టం వచ్చినట్లు ఇంటి స్థలాలుగా విభజించి అమ్మకానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులును ఆ వెంచర్లను తొలగించారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబర్ 24 : నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అందిన వివరాల ప్రకారం చీరాల మండలం తోటవారిపాలెంకు చెందిన కాగిత పరిశుద్ధరావు ఎద్దుల బండితో అదే గ్రామ శివారులోని పొలాల్లో ఇసుకను తవ్వి అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి ఎద్దులబండిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పర్చూరు, సెప్టెంబరు 24 : క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర అన్నారు. మంగళవారం వీరన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసి వారోత్సవాల్లో పాల్గొన్నారు. గర్భిణులకు సమతుల ఆహారాన్ని అందించడం ద్వారా పుట్టిన బిడ్డతోపాటు, తల్లి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చెరుకూరు సెక్టార్ సూపర్ వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి చిత్రపటాల బహూకరణ

చినగంజాం, సెప్టెంబరు 24 : చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు చిత్రపటాలను బహుకరించారు. గ్రామ కార్యదర్శి ఎ.మస్తాన్‌రావుకు మంగళవారం కూటమి నాయకులు ఫొటోలను అందజేశారు. జనసేన సీనియర్ నాయకుడు సందు శ్రీరామ్, టీడీపీ నాయకులు మోటుమర్రి రామసుబ్బారావు, షేక్ నబీషా చిత్రపటాలను బహుకరించారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారం

మార్టూరు, సెప్టెంబరు 24 : ప్రకృతి వ్యవసాయం ద్వారా విష రసాయన అవశేషాలు లేని మంచి ఆహారాన్ని పొందవచ్చునని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పీ వాణిశ్రీ అన్నారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై మండల సమాఖ్య కార్య నిర్వాహక సభ్యులకు మండల కాంప్లెక్స్ వద్ద వెలుగు కార్యాలయంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాణిశ్రీ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడి, తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలను పండించుకోవచ్చునన్నారు. అనంతరం సీనియర్ కన్సల్టెంట్ జానకమ్మ మాట్లాడుతూ మండల సమాఖ్య సమావేశాలలో ప్రకృతి వ్యవసాయాన్ని ఒక అజెండాగా చేర్చాలన్నారు. తద్వారా పొదుపు సంఘాలకు, గ్రామ సంఘాలకు దీనిపై అవగాహన కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పెరటి తోటల పెంపకానికి ప్రాధాన్యను ఇవ్వాలన్నారు. గ్రామాలలో పొదుపు గ్రూపులలోని మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మోహన్, ఏపీఎం రాజారత్నం, ఎంటీఎల్ రాజశేఖర్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం వద్ద బీజేపీ నేతలు

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అద్దంకి, సెప్టెంబరు 24 : పీఎం నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా సేవా పక్షోత్సవాలలో భాగంగా బీజేపీ నేతల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రేపల్లె రెడ్ క్రాస్ సహాయంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, యువ మోర్చా నాయకులు కోటిరెడ్డి, అశోక్, సురేష్ తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణ, తమ్మన శ్రీనివాసరావు, బంగారుబాబు, కొల్లి కోటేశ్వరరావు, యలమందరావు, శ్రీనివాసరావు, శ్రీరామ్, రామాంజనేయరాజు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

పంగులూరు, సెప్టెంబరు 24 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తిని చూపాలని ఎంఈవో జీ వీరాంజనేయులు అన్నారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఎంఈవో ప్రారంభించారు. ఆరు ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలిచిన జట్లు ఈనెల 27న నియోజకవర్గ పరిధిలో ఏల్చూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అణిత, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



వృద్ధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న సెయింట్ ఆన్స్ విద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 24 : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు అందిస్తున్న సేవా కార్యక్రమాలు హర్షనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు ఎన్ఎస్ఎస్ ద్వారా ఇప్పటి వరకు చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వేటపాలెం మండలం దేశాయిపేటలోని అనాథ, వృద్ధ శరణాలయంలో వృద్ధులకు రెండు బస్తాల బియ్యం, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహక ప్రతినిధులు సత్రం మల్లీశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల దాతృత్వం, అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల డాక్టర్ సీఎస్‌రావు అక్రిడిటేషన్స్ డైరెక్టర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ దీవి జ్యోతిస్వరూప్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య అవసరాలపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఫార్మసీ విద్యార్థులు

ఇంకొల్లు, సెప్టెంబరు 24 : డీసీఆర్ఎం ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య అవసరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఆర్ఎం కళాశాల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు ఆరోగ్య అవసరాలు తీర్చడంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు, ప్రిన్సిపాల్ డా.ఏ. వేణు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హితంతోనే ఆరోగ్యం

చీరాలటౌన్, సెప్టెంబరు 24 : ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా ముందుకు సాగితేనే ఆరోగ్యంగా, సంతోషంగా జీవిస్తారని విజయవాడ దత్తోపంత్ ఠేంగ్డడి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ సంచాలకులు రవిశంకర్ పేర్కొన్నారు. చీరాల ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, విజయవాడ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో స్వచ్ఛత హి సేవపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీ మథీన్, కళాశాల ప్రిన్సిపాల్ పీవీ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే కొండయ్య



చినగంజాంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

చీరాల, సెప్టెంబరు 24 : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని తోటవారిపాలెంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు, వారి బాగోగులను కొండయ్య తెలుసుకున్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాగుతున్న పౌష్టకాహార మాసోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో నేతాజీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంగులూరు, సెప్టెంబరు 24 : ప్రజల ఆకాంక్షలు, సమస్యలు తీరేలా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు, మరోపక్క రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అన్నారు. మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి 100 రోజుల ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్. సునీత, జార్లమూడి సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, కాపుగారి సురేష్, తాతయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

చినగంజాం : పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, ఎంపీడీవో కే.స్వరూపరాణి అన్నారు. మండలంలోని చినగంజాం, పల్లెపాలెం గ్రామాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను నాయకులు అందజేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఉపాధి హామీ పథకం నిధులతో చినగంజాం గ్రామంలో రూ.7లక్షల రూపాయిలు, సోపిరాల గ్రామంలోని విజయరావు బజారులో రూ.23.5లక్షల రూపాయిలు, పల్లెపాలెం గ్రామంలో రూ.17లక్షల రూపాయిలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలో పలు చోట్ల సిమెంట్ రోడ్లకు, డ్రైనేజీ పనులకు రూ.2కోట్ల రూ.45 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉప సర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, పాలక వర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్లెపాలెం గ్రామ సర్పంచ్ సైకం మణి, హౌసింగ్ ఏఈ జి.రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు ఎ.మస్తాన్‌రావు, నాగేంద్రబాబు, టీడీపీ కూటమి నాయకులు సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, షేక్.జిలాని, పి.లక్ష్మీనారాయణ, డి.ఏసు నారాయణ, జి.వెంకటనారాయణ, బడుగు సామ్యే లు, షేక్ హుస్సేన్ బాష, జి.నరసింహారావు, టి.చిన్నా, సంఖ్యా శ్రీను, ఎస్‌సీ.సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తుందని, ఇది మంచి ప్రభుత్వం అని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం దైవాలరావూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన మాట్లాడారు. 100 రోజుల్లో జరిగిన అభివృద్ధి పనులను ఆర్డీవో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ మెహతాజ్, సర్పంచ్ కోనూరి సీతామహాలక్ష్మి, టీడీపీ నాయకులు చెన్నుపాటి హరిబాబు, ఐడీసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి పాల్గొన్నారు.



పంగులూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

ఆధునిక పద్ధతులతోనే వ్యవసాయాభివృద్ధి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 24 : ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారానే అభివృద్ధి సాధ్యమని అద్దంకి సహాయ వ్యవసాయ సహాయకులు కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రంలో గ్రామ సభ సర్పంచ్ చావల కల్యాణి అధ్యక్షతన జరిగింది. ముందుగా వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో సాంకేతికతో డ్రోన్ టెక్నాలజీతో పురుగు మందులు పిచికారీ విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. చీడ పీడలు గుర్తించేందుకు సీఎల్ఎస్ యాప్ ప్రవేశపెట్టిందన్నారు. పశు వైద్యశాఖ ఏడీ డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ రాయితీపై ఎర్ర జొన్నలు అందిస్తున్నట్లు తెలిపారు. పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కూరగాయల సాగు రైతులకు విత్తనాలపై ఎకరాకు రూ.8వేలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బొమ్మనంపాడు వెటనరీ అసిస్టెంట్ సర్జన్ అశోక్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు రోజీ, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : పంట సాగులో నూతన పద్ధతులను అనుసరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఏవో డీ సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరులో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది, వీఏఏ పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా రైతులు పంటలు సాగు చేయాలని ఏఓ కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని వేమవరం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొగాకు, పత్తి పైర్లను ఏవో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వెంకట్రావు, సర్పంచ్ దూళిపాళ్ల వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు అలివేలమ్మ, టీడీపీ నాయకులు గొట్టిపాటి మారుతి, మల్లాది వీరాంజనేయులు, వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా ప్రారంభం

వేటపాలెం : మండల పరిధిలోని తోటవారిపాలెంలో మంగళవారం వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య జెండాఊపి ప్రారంభించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏవో సుమతి, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పంటల సాగులో మిశ్రమ ఎరువులు వాడడంవలన పంటలకు మేలు జరుగుతోందని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని పావులూరలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పత్తిసాగును పరిశీలించిన ఆయన రసం పీల్చే పురుగు నివారణపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పావులూరు గ్రామ సర్పంచ్ లూథియమ్మ, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

చెరుకూరు(పర్చూరు) : ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్ట పరిహారం అందుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) మోహనరావు తెలిపారు. చెరుకూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేలను రైతు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మేరమ్మ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ నాగసాయి కల్యాణ్, జడ్పీటీసీ మాజీ సభ్యులు ఉషారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : రైతులకు వ్యవసాయంలో సాగు చేస్తున్న పంటలకు వచ్చే చీడపీడల నివారణకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వ్యవసాయఅధికారి వీరగంధం కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని డేగరమూడి గ్రామంలో అధికారులు పత్తిని పరిశీలించారు. అనంతరం ఉద్యాన అధికారి హనుమంతనాయక్, పశువైద్యాధికారి మాధవీలత లు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఏడీఏ శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో అంజిరెడ్డి, ఏఈవో మాధురి పాల్గొన్నారు.







అద్దంకిలో మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్, వేమవరంలో మాట్లాడుతున్న ఏవో, పర్చూరులో మాట్లాడుతున్న ఏడీఏ మోహనరావు


టంగుటూరులో స్వీట్లు పంచుతున్న టీడీపీ శ్రేణులు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పదవుల తొలిజాబితాలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. నిబద్ధతతో పార్టీల్లో కష్టపడి పనిచేస్తున్న నాయకులను ప్రోత్సహిస్తూ చైర్మన్ పదవులను కట్టబెట్టారు. అదేవిధంగా చాలా ప్రాధాన్యత ఉన్న సంస్థలు కావడం విశేషం. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు మొత్తం నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించగా, అందులో మూడు టీడీపీ నేతలకు, ఒకటి బీజేపీ నేతకు దక్కాయి. జనసేనకు ఒక డైరెక్టర్ పదవి దక్కింది. ఈ పదవుల పంపిణీపై తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో సంపూర్ణ సానుకూలత వ్యక్తం అవుతుండగా, బీజేపీ, జనసేనల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.


దామచర్ల సత్య


నూకసాని బాలాజీ


పిల్లి మాణిక్యాలరావు


లంకా దినకర్

పదవుల్లో పెద్దపీట

నిబద్ధతకు అందలం

పిన్నవయసులోనే సత్యకు గుర్తింపు

- టీడీపీ నుంచి నూకసాని బాలాజీ, మాణిక్యాలరావుకు చైర్మన్ పదవులు
- బీజేపీ నుంచి లంకా దినకర్‌కు అవకాశం
- జనసేన నుంచి గౌతంరాజుకు డైరెక్టర్ పదవి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాకు కార్పొరేషన్ పదవుల విషయంలో కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. నాలుగు చైర్మన్ పదవులు మనకు దక్కాయి. చిన్న వయసులోనే తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు పొందిన ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఉత్తరాంధ్ర పార్టీ కోఆర్డినేటర్ దామచర్ల సత్యన్నారాయణ అలియాస్ సత్యకు గౌరవప్రదమైన చైర్మన్ పదవి దక్కడం విశేషం. ఆంధ్రప్రదేశ్ పోర్టులు, హార్బర్ల నిర్వహణ సంస్థ (ఏపీ మారిటైం బోర్డు) చైర్మన్‌గా సత్య నియమితులయ్యారు. అలాగే టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న యాదవ సామాజికవర్గానికి చెందిన నూకసాని బాలాజీ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ ఇద్దరిది కొండపి నియోజకవర్గం. బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా ఉన్న ఒంగోలుకు చెందిన లంకా దినకర్‌ను 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమించారు. అలాగే చీరాలకు చెందిన దళిత ఉద్యమకారుడు టీడీపీ అధికార ప్రతినిధి అయిన పిల్లి మాణిక్యాలరావు లిడ్ క్యాప్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే వైపాలెంకు చెందిన జనసేన నాయకుడు డాక్టర్ పాకనాటి గౌతంరాజు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

టీడీపీలో ఆచితూచి ఎంపికలు..

తెలుగుదేశం పార్టీ పదవుల కేటాయింపులో అధిష్టానం పలు జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. అనేకమంది నాయకుల పేర్లను పరిశీలించినప్పటికీ ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వంలో, ఆ తర్వాత ఎన్నికల సమయంలో నిబద్ధతతో పనిచేసిన వారికి ఈ జాబితాలో అవకాశం ఇచ్చారని ఆ పార్టీశ్రేణులు భావిస్తున్నాయి. కొండపి నియోజకవర్గానికి చెందిన దామచర్ల సత్య, నూకసాని బాలాజీలతోపాటు చీరాల నియోజకవర్గానికి చెందిన పిల్లి మాణిక్యాలరావు కూడా టీడీపీలో కీలకంగా పనిచేస్తున్నారు. సామాజికవర్గాల సమీకరణకు తగు ప్రాధాన్యం ఇచ్చారు. దామచర్ల సత్య ఓసీ కాగా నూకసాని బాలాజీ యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. మాణిక్యాలరావు దళిత ఉద్యమం నుంచి వచ్చిన నాయకులు. దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు మనుమడైన సత్య 2012 నుంచి కొండపి నియోజకవర్గ టీడీపీ బాధ్యతల నిర్వహణలో కీలక భూమిక పోషించారు. పార్టీ పట్ల నిబద్ధత, పనితీరులో చాతుర్యాన్ని గమనించి ఆయనకు ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు. సమర్థవంతంగా ఆ బాధ్యత నిర్వహించి అటు చంద్రబాబు, ఇటు లోకేష్ మన్ననలు పొందారు. నారా లోకేష్ నిర్వహించిన యువగళంలో తెర వెనుక కీలకపాత్ర పోషించిన వారిలో సత్య కూడా ఒకరు. ఇంజనీరింగ్ పూర్తిచేశారు. ఉత్తరాంధ్రతో ఉన్న సంబంధాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రామాయపట్నం నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో సత్యకు మారిటైం బోర్డు చైర్మన్ పదవి దక్కడం పట్ల ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు.

బీసీ నేతకు కీలక చైర్మన్ పదవి

ఇక జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న బాలాజీ 2019 ముందు వైసీపీలో జడ్పీ చైర్మన్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన ఆయన పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. అది గమనించి గత టీడీపీ ప్రభుత్వం ఆయనకు యాదవ కార్పొరేషన్ పదవి ఇచ్చింది. లిడ్ క్యాప్ చైర్మన్‌గా నియమితులైన మాణిక్యాలరావు దళిత నేత. చీరాల విజయనగర్ కాలనీకి చెందిన ఆయన చీరాల టీడీపీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు.

బీజేపీ, జనసేనలో మిశ్రమ స్పందన

బీజేపీ, జనసేనలకు సంబంధించి ఒక్కొక్క పదవి దక్కినప్పటికీ ఆ పార్టీశ్రేణుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కీలకమైన 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ నేత లంకా దినకర్ ఒంగోలు వాసి. చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తూ టీడీపీ కుటుంబం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆయన తొలుత టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, ఆ తర్వాత టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2019 తర్వాత బీజేపీలో చేరిన ఆయన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకుల్లో మంచి గుర్తింపు పొందారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా పొలిటికల్ ఫీడ్ బ్యాక్ ప్రముఖ్‌గా పనిచేస్తున్నారు. ఆయా అంశాల్లో మంచి విశ్లేషకుడిగా దినకర్ గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నప్పటికీ జిల్లా కోటాలోనే పదవి దక్కడం విశేషం. అయితే జిల్లాకు చెందిన మరొకరికి కూడా అవకాశం లభిస్తే బాగుండేదన్న భావన బీజేపీ నాయకుల్లో వినిపిస్తుంది. జనసేన నుంచి జిల్లాకు ఒక డైరెక్టర్ పదవి మాత్రమే దక్కింది. అదీ వైపాలెంకు చెందిన డాక్టర్ పాకనాటి గౌతంరాజుకు దక్కింది. జిల్లాస్థాయిలో ఆయా నియోజకవర్గాల స్థాయిలో మొదటి నుంచి జనసేనలో పనిచేస్తున్న నాయకులు కొందరు రేసులో ఉన్నప్పటికీ అవకాశం లభించకపోవడంపై నాయకుల్లో కొంత అసంతృప్తి కనిపిస్తోంది.

నమ్మకం వమ్ముకాకుండా పనిచేస్తా : సత్య

పార్టీలో అంకితభావంతో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుందనేందుకు ఈ నియామకాలు దర్పణమని దామచర్ల సత్య వ్యాఖ్యానించారు. చిన్న వయస్సులోనే మంచి కార్పొరేషన్ పదవిని అప్పగించిన అగ్ర నాయకులకు, సహకరించిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు, లోకేష్‌ల నమ్మకం వమ్ముకాకుండా పెద్దాయన ఆంజనేయులు పేరు చెడకుండా కొండపి నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తలకు అండగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం : బాలాజీ

తెలుగుదేశం పార్టీలోనే బడుగు బలహీనవర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందనేందుకు పదవుల తొలి జాబితానే దర్పణం పట్టిందని నూకసాని బాలాజీ వ్యాఖ్యానించారు. నిజాయితీగా పనిచేసి. కార్పొరేషన్‌కు గుర్తింపు తెస్తూ, పార్టీ కోరుకున్న విధంగా బలహీన వర్గాల ప్రజలను టీడీపీలోకి సమీకరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. చంద్రబాబు, లోకేష్, మంత్రులు స్వామి, రవి, సత్యప్రసాద్, రవీంద్ర, బీసీ జనార్దన్‌రెడ్డితోపాటు జిల్లాలోని టీడీపీ నాయకులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

సీఐగా శేషగిరిరావు బాధ్యతల స్వీకరణ


సిఐ శేషగిరిరావు

చీరాలటౌన్, సెప్టెంబర్ 24 : చీరాల రూరల్ సీఐగా శేషగిరిరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో శేషగిరిరావు వన్‌టౌన్‌లో విధులు నిర్వహించారు. అనూహ్యంగా ఆయన్ని వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం రాత్రి వెలువడిన ఉత్తర్వుల్లో శేషగిరిరావుకు రూరల్ పోస్టింగ్ అందింది. అయితే ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నిమ్మగడ్డ సత్య నారాయణకు ఇంకా పోస్టింగ్ ఎక్కడ అనేది నిర్ధారణ కాలేదు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి సిబ్బంది స్వాగతం పలికారు.

రమేష్‌చంద్రకు నేతల నివాళి

అద్దంకి, సెప్టెంబరు 24 : సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మన్నె రమేష్‌చంద్ర అనారోగ్యం తో సోమవారం రాత్రి మృతి చెందారు. ముప్పవరం టీడీపీ నేత ధూళిపాళ్ల రామచంద్ర ప్రసాద్ అల్లుడు రమేష్‌చంద్ర సుదీర్ఘకాలం పాటు అమెరికాలో ఉండి మూడేళ్ల కిందట ఇండియాకు తిరిగి వచ్చారు. అనారోగ్యంతో ఉన్న రమేష్‌చంద్ర సోమవారం రాత్రి మృతి చెందగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, బాచిన చెంచుగరటయ్య తదితరులు రమేష్‌చంద్ర మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

సంతమాగులూరు, సెప్టెంబరు 24 : విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు విద్యుత్ అదాలత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా విశ్రాంత న్యాయాధికారి ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన 22 మంది అర్జీలను అందజేశారు. వాటిలో 13 సమస్యలను వెంటనే పరిష్కరించినట్లు విద్యుత్ ఏఈ దీపక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కే వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఏ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది బదిలీ

అద్దంకి, సెప్టెంబరు 24 : అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో పలువురు సిబ్బంది బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి పర్చూరు బదిలీ కాగా, చీరాల నుంచి సురేష్‌బాబును అద్దంకిలో నియమించారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న జీవీఎస్ రామారావు(శంకర్) ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న కృష్ణమోహన్ కొరిశపాడుకు బదిలీ అయ్యారు. టైపిస్టు జి.శ్రీనివాసరావు బల్లికురవకు బదిలీ కాగా, కొరిశపాడు నుంచి స్వేతను నియమించారు. సాయి కృష్ణను కొరిశపాడుకు బదిలీ చేశారు.

గేదెల చోరీపై రాస్తారోకో

మేదరమెట్ల, సెప్టెంబరు 24 : పాడి గేదెలే తమకు జీవనాధారమని, దొంగల నుంచి గేదెలను తమకు అప్పగించాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. పలువురు పాడి రైతులు మంగళవారం మేదరమెట్ల సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. మండలంలోని కొరిశపాడులో ఎనిమిది గేదెలు, గుడిపాడులో కొన్ని గేదెలు చోరీకి గురయ్యాయి. సోమవారం రాత్రి పి.గుడిపాడులో పాడి రైతు కొష్టం వద్ద ఉన్న గేదెకు 12 గంటల సమయంలో మేత వేసి ఇంటికి వచ్చారు. అరగంటలో మళ్లీ వెళ్లి చూడగా గేదె లేదు. వెంటనే ఆ రైతు గ్రామస్థులందరికీ ఫోన్‌లో విషయం చెప్పారు. అందరూ వెతుకుతుండగా ఆటోలో గేదెను ఎత్తుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని అడ్డుకున్నారు. ఆటో డ్రైవర్ పారిపోగా, మిగిలిన వారిలో మేదరమెట్లకు చెందన రేగుల నాగార్జున, శ్రీనివాసరావు, తమ్మవరానికి చెందిన బట్టు గురుస్వామిని గ్రామస్థులు పట్టుకొని కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తమ గేదులు కనిపించడంలేదని చుట్టుపక్కల గ్రామాల పాడి రైతులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. కొంత సమయం ఇస్తే దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ సురేష్ హామీ ఇచ్చారు.


చౌటపాలెం ఎస్సీ కాలనీలోని ఓ ఇంటికి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్ అంటిస్తున్న మంత్రి స్వామి

ఉత్సాహంగా.. ఊరూరా

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, సిబ్బంది

ఇంటింటికి ప్రభుత్వం వంద రోజుల పాలన విజయాలు వివరణ

చౌటపాలెంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి

ఇతర చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు

ఒంగోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'ఇది మంచి ప్రభుత్వం' ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఊరూరా టీడీపీ కేడర్, క్షేత్రస్థాయిలోని ప్రభుత్వశాఖల సిబ్బంది సమన్వయంతో పాల్గొంటున్నారు. వంద రోజుల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, విజయాలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నారు. అదే సమయంలో జిల్లాలో మంత్రి డాక్టర్ స్వామి ఇతర ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు తమ పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని మరింత ఉత్సాహపరుస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 20 నుంచి 26 వరకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో ఎక్కడికక్కడ క్షేత్రస్థాయి ప్రభుత్వ సిబ్బంది, టీడీపీ కేడర్ ఈ కార్యక్రమంలో పాల్గొంటుంది. మండలానికి రెండేసి గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. వారంరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఐదవ రోజైన మంగళవారం మరింత ఉత్సాహంగా సాగింది. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం చౌటపాలెంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు రూరల్ మండలం వలేటివారిపాలెంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొనగా చీమకుర్తి మండలం బూసరపల్లిలో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నెరవేర్చిన హామీల గురించి వివరించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పెద్దనాగులవరం గ్రామంలో పాల్గొనగా, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కంభం మండలం తురిమెళ్ళలో, వైపాలెం ఇన్‌చార్జీ ఎరిక్షన్‌బాబు పుల్లలచెరువు మండలం ఐటీవరంలో జరిగిన సభలో పాల్గొన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉత్సాహంగా కార్యక్రమం కొనసాగింది.

బాబు చెప్పారు.. గోరంట్ల చేశారు!

శ్రీహర్షిణీలో ఇద్దరు విద్యార్థులకు ఉచిత విద్య


పఠాన్ రజియాకు ప్రవేశపత్రాన్ని అందిస్తున్న రవికుమార్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 24: మద్దిరాల పాడులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేద తల్లిదండ్రులకు వారి పిల్లల చదువుపై ఇచ్చిన హామీని మంగళవారం శ్రీహర్షిణీ విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ నెరవేర్చారు. మద్దిరాలపాడులో ఖాజావలి, బీబీసారాల ఇద్దరు విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి చదువు బాధ్యతను రవికుమార్ చూసుకుంటారని సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం దంపతుల కుమార్తె పఠాన్ రజియాను ఒంగోలులోని శ్రీహర్షిణీ జూనియర్ కళాశాలలో చేర్పించారు. కుమారుడిని మార్టూరులోని శ్రీహర్షిణీ స్కూలులో పదవ తరగతిలో చేర్పించబోతున్నారు. ఈ ఇరువురికి చంద్రబాబు హామీ మేరకు ఉచిత విద్య, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. సీఎం చంద్రబాబుకు, పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న రవికుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఖాజావలి, బీబీసారలు కృతజ్ఞతలు తెలిపారు.

గుండ్లకమ్మ పనులు వేగవంతం

కూటమి ప్రభుత్వంలో రూ.8 కోట్లు కేటాయించాం

సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ

త్వరలోనే కాల్వల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్


వెల్లంపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మద్దిపాడు,సెప్టెంబర్ 24 : 'జిల్లాలోని కీలకమైన గుండ్లకమ్మ గేటు కొట్టుకుపోయినా నాటి వైసీపీ పాలకులు చోద్యం చూస్తుండిపోయారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుండ్లకమ్మ ప్రాజెక్టుకు రు.8 కోట్లు నిధులు కేటాయించింది. ఈ మొత్తంతో ప్రస్తుతం ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి' అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం వెల్లంపల్లి పొగాకు బోర్డుకు చేరుకున్న మంత్రి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. పూర్తిస్థాయిలో రైతుల పంట కొనుగోలుకు అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు రిపేరు పనులను స్థానిక రైతు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద ఉన్న కాల్వల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులపై సంబంధిత శాఖ మంత్రి రామానాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి గుండ్లకమ్మ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి రవికుమార్ పొగాకు బేళ్లను పరిశీలించారు. లోగ్రేడ్ పొగాకును కూడా వెనక్కి పంపకుండా మొత్తం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. సాధ్యమైనంత వరకు పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వెల్లంపల్లి రైతు సంఘం అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాల చౌదరి రావి ఉమామహేశ్వరరావు మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మండవ జయంతిబాబు, మండవ గోపీనాథ్, నాగన్నపాలెం సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్, వెల్లంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు అద్దేపల్లి గంగాభవాని, క్లస్టర్ ఇన్‌చార్జ్ పాటిబండ్ల అజయ్‌బాబు, మండవ శ్రీరామమూర్తి, మారెళ్ల హరికుమార్, మండవ గోవిందరాజులు, కోనూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

17 మంది తహసీల్దార్లు బదిలీలు

నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఐదుగురికి పోస్టింగ్‌లు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24 : జిల్లాలో ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ సీఈవో మాధురి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 17 మందిని బదిలీ చేయగా నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఐదుగురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాలు ఉండగా మంగళవారం రాత్రి 22 మందికి పోస్టింగ్‌లు ఇవ్వగా మిగిలిన మండలాలకు బుధవారం బదిలీలు చేసే అవకాశం ఉంది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పీ సుజాత	కొత్తపట్నం	పొన్నలూరు
పీ శ్రీకృష్ణ	పొదిలి	కొత్తపట్నం
కే స్వరూపారాణి	చినగంజాం	జెపంగులూరు
కే రాజశేఖర్‌రావు	గుడ్లూరు	ఒంగోలు
ఏ శ్రీనివాసమూర్తి	కొనకనమిట్ల	చినగంజాం
ఎన్ జగదీష్	అర్ధవీడు	మర్రిపూడి
బీ రామాంజనేయులు	జే పంగులూరు	కొండపి
వై శ్రీనివాసరావు	మద్దిపాడు	మార్టూరు
కే నేతాజీ	చీరాల	కారంచేడు
పీ రత్నజ్యోతి	టంగుటూరు	కందుకూరు
డీ నరసయ్య	కొమరోలు	అర్ధవీడు
ఆర్ దేవసేనకుమారి	అద్దంకి	టంగుటూరు
డీ జయమణి	నాగులుప్పలపాడు	సింగరాయకొండ
ఆర్‌ఎల్ రాజ్యలక్ష్మీ	ఇంకొల్లు	కొరిశపాడు
ఎంవీ రమణమూర్తి	కొండపి	జరుగుమల్లి
కే సుకుమకుమారి	దర్శి	బల్లికురవ
డీ సురేష్‌బాబు	కొరిశపాడు	ఎస్ఎన్‌పాడు
వీ జ్యోతి	నెల్లూరు	మద్దిపాడు
జీ శ్రీనివాసరావు	నెల్లూరు	ఇంకొల్లు
ఎం రాజేష్‌బాబు	నెల్లూరు	వేటపాలెం
బీ సింగయ్య	నెల్లూరు	అద్దంకి
ఎం రంగసుబ్బరాయుడు	నెల్లూరు	హెచ్ఎంపాడు

పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీల బదిలీ

నేడో, రేపో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న మండలస్థాయి ఈఓఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలు భారీగా జరగనున్నాయి. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తదనుగుణంగా జిల్లా పంచాయతీ కార్యాలయంలోనూ బదిలీలకు శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా 30మందికిపైగా ఈఓఆర్‌డీలు స్థానచలనం కానుండగా కార్యదర్శులు 400మంది వరకు మారనున్నట్లు తెలిసింది. బదిలీల ప్రక్రియ జిల్లా పంచాయతీ కార్యాలయంలో పూర్తయింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆ ఫైలుపై ఆమోద ముద్ర వేసిన వెంటనే అందరికీ ఆర్డర్లు జారీ చేయనున్నారు.

వైద్యరంగానికి ప్రాధాన్యం

- కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే, దాతల సహకారం అభినందనీయం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా


తల్లీబిడ్డ సంరక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కనిగిరి, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం కనిగిరి ప్రాంతంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. డాక్టర్ ఉగ్ర తన సొంత నిధులతో ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును అభివృద్ధి చేస్తున్న తీరును పరిశీలించి ప్రశంసించారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు కూడా ముందుకు వచ్చి ప్రభుత్వానికి తోడుగా నిలవడం అభినందనీయమన్నారు. అప్పుడే పుట్టిన చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అస్పత్రిలో ఏర్పాటుచేసిన ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సాంకేతిక యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు. వీటి కోసం ఇప్పటికే రూ11 లక్షలు వెచ్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. తల్లి, బిడ్డ సంరక్షణే ధ్యేయంగా కనిగిరి ప్రభుత్వాసుపత్రి రాష్ట్రంలోనే ముందుంజలో ఉండాలన్నదే తన సంకల్పంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, మున్సిపల్ చైర్మన్ గఫార్, సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్ అన్సారియాకు అందజేశారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తీసుకుంటున్న చొరవ, పడుతున్న తపన తనను కదిలించిందని వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇందులో తాము కూడా భాగస్వాములవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.